సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 13 । నవంబర్ । 2022



అడవితల్లి నీడలో జీవనం అదృష్టం

జి.మాడుగుల: అడవితల్లి నీడలో జీవించడం అదృష్టమని టీటీడీ గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. అడవితల్లి హారతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.



మెగా లోక్ అదాలత్‌లో 23 కేసులు పరిష్కారం

చింతపల్లి: మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 23 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తి ఎస్.రెడ్డి ప్రసన్న తెలిపారు.

వేడుకగా సారె ఊరేగింపు



సాక్షి,పాడేరు: గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు నిర్వహించారు. పాడేరు పట్టణంలోని పుర వీధుల గుండా సాగింది.



అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

జన సునామి

- 30 ఎకరాల ఏయూ మైదానంలో జనసందోహం
- 12వేల ఆటోలు, 6 వేల బస్సులు, 2 వేల కార్లలో తరలివచ్చిన జనం
- 10 వైద్య శిబిరాల నిర్వహణ.. ఫైరింజన్లు, అంబులెన్స్‌ల ఏర్పాటు
- తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, అల్పాహారం అందజేత
- 6,700 మంది పోలీసులతో బందోబస్తు

విశాఖ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభ



సభకు భారీ ఎత్తున హాజరైన ప్రజలు

నేల ఈనలేదు.. ఆకాశానికి చిల్లు పడలేదు. సాగరం ఉప్పొంగలేదు. హోరుగాలి అసలే లేదు. అయినా ఓ ఉప్పెనలా జనసునామీ విశాఖను ముంచెత్తింది. జనం ప్రభంజనంలా కదలివచ్చింది. 30 ఎకరాల సువిశాల మైదానం.. రహదారులు.. బస్సులు.. ఆటోలు.. ఇలా ఎటు చూసినా జనమే జనం. అవతలి అంచు కనిపించని జనప్రవాహం. ఒక్కమాటలో చెప్పాలంటే శనివారం నగరం జనంతో నిండుకుండలా తొణికిసలాడింది. ఏయూ ఇంజినీరింగ్ మైదానం జనసంద్రంలా మారింది. కెరటాల్లా తరలివచ్చిన ప్రజల హర్షధ్వానాలు.. సముద్ర ఘోష కూడా వినిపించనంతగా జై జగన్.. జై విశాఖ నినాదాలు హోరెత్తాయి.

సాక్షి, విశాఖపట్నం : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు హాజరైన భారీ బహిరంగ సభ కనీవినీ ఎరుగని రీతిలో జరిగింది. విశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది జనం తరలిరావడంతో శనివారం ఏయూ మైదానం జన సాగరంలా మారింది. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఊహించిన దాని కన్నా.. అధికంగానే జనం తరలి రావడంతో ఉదయం 7.30 నుంచే మద్దిలపాలెం, పెదవాల్తేరు వైపు దారుల్లో సందడి నెలకొంది. ఉదయం 9 గంటల లోపు వచ్చిన వారందరితో మైదానం నిండిపోవడంతో.. ఆ తర్వాత వచ్చిన వారందరినీ పోలీసులు లోపలికి అనుమతించలేదు. సుమారు లక్ష మంది వరకు రోడ్లు, బస్సుల్లోనే ఉండిపోయారు. మద్దిలపాలెం బస్టాండ్ వేలాది మందితో నిండిపోయింది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హనుమంతవాక వరకు .. ఇటు సత్యం జంక్షన్ వరకు వాహనాలతో రోడ్లు నిండిపోయాయి. ఒక్క విశాఖ నగరం నుంచే 1.6 లక్షల నుంచి 1.7 లక్షల మంది జనం వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 1.5 లక్షలకు పైగా వచ్చినట్లు సమాచారం. సుమారుగా 12 వేల నుంచి 13 వేల వరకు ఆటోలు, 6 వేలకు పైగా బస్సులు, 2 వేలకు పైగా కార్లు, వెయ్యికి పైగా ఇతర వాహనాల్లో జనం తరలి వచ్చారు. ఒక్క జీవీఎంసీ పరిధిలోనే 6,700 వరకు ఆటోలు, 2,300 వరకు బస్సుల్లో ప్రజలు తరలివచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.



సభకు తరలి వస్తున్న జనం

ప్రజలకు అసౌకర్యం లేకుండా చర్యలు

భారీ బహిరంగ సభకు హాజరైన ఏ ఒక్కరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా యంత్రాంగం పూర్తి చర్యలు చేపట్టింది. సుమారు 6,700 మంది పోలీసులతో పకడ్బందీగా బందోబస్తుతో పాటు వైద్య పరంగా అన్ని ఏర్పాట్లు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సభా ప్రాంగణంలో 10 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆరు 108 అంబులెన్స్‌లు సిద్ధం చేశారు. కార్డియాలజిస్ట్, పీడియాట్రిషన్, ఫిజీషియన్, సర్జన్ స్పెషలిస్ట్‌లతో పాటు ఇతర వైద్య సిబ్బంది సుమారుగా 200 మంది వరకు విధులు నిర్వర్తించారు. అవసరమైన వారికి వైద్య శిబిరాల్లో మందులు అందించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా నాలుగు అగ్నిమాపక శకటాలను సిద్ధంగా ఉంచారు. ఎక్కడికక్కడ మొబైల్ టాయిలెట్ల సౌకర్యం కల్పించారు. సభకు హాజరైన లక్షాలాది మందికి టిఫిన్, మజ్జిగ ప్యాకెట్లు, అల్పాహారంగా బిస్కెట్లు అందజేశారు. సభా ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రజలకు నేరుగా వలంటీర్లే మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, అల్పాహారం అందించారు. జిల్లాల వారీగా బస్సుల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

విశాఖపట్నం.. విశేషపట్నం!

- దేశంలో ప్రత్యేకమైన నగరమని ప్రధాని మోదీ కితాబు
- అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ విశాఖ ప్రముఖ వ్యాపార కేంద్రమే
- ఫిషింగ్ హార్బర్ అభివృద్ధితో మత్స్యకార జీవితాల్లో మార్పు
- గొప్ప చారిత్రక అభివృద్ధి కార్యక్రమాలకు వేదికగా నిలిచిందన్న పీఎం



సభా వేదికపై పీఎం నరేంద్రమోదీ, గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నంపై ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసల జల్లులు కురిపించారు. విశాఖ విశిష్టతను ఎంతగానో శ్లాఘించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ పలుమార్లు ఆయన విశాఖ ఔన్నత్యాన్ని చాటారు. విశాఖపట్నం.. విశేషపట్నమని అభివర్ణించారు. దేశంలోనే ఇది ప్రత్యేక నగరమని కొనియాడారు. విశాఖలో వ్యాపారం చాలా కాలంగా అభివృద్ధి చెందుతోందని, అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ విశాఖ ప్రముఖ వ్యాపార కేంద్రమేనని పేర్కొన్నారు. 'విశాఖపట్నానికి చాలా విశిష్టమైన వర్తక, వ్యాపార సంప్రదాయాలున్నాయి. ప్రాచీన కాలం నుంచే విశాఖపట్నంలో ప్రముఖ ఓడరేవు (పోర్టు) ఉంది. ఇది వేల సంవత్సరాల క్రితం నుంచే పశ్చిమాసియా, రోమ్‌లకు వాణిజ్య మార్గంలో భాగం. నేడు భారత దేశ వాణిజ్యానికి విశాఖపట్నం కేంద్ర బిందువుగా మారింది' అని వివరించారు. ఎన్నో గొప్ప చారిత్రక అభివృద్ధి కార్యక్రమాలకు విశాఖ వేదికగా నిలిచిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. శనివారం శంకుస్థాపనలు, జాతికి అంకితం చేసిన రూ.వేల కోట్ల ప్రాజెక్టులు రాష్ట్రంతో పాటు విశాఖపట్నం అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్‌ను ఆధునీకీకరణ చేస్తున్నామని, ఇవి కూడా విశాఖ ప్రగతిలో భాగస్వామ్యమవుతాయని చెప్పారు. ఫిషింగ్ హార్బర్ ఆధునీకీకరణతో మత్స్యకార జీవితాల్లోనూ మరింత మంచి మార్పు తీసుకొస్తుందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న ఇక్కడి వారి కల ఇప్పుడు సాకారమవుతోందన్నారు. 'మల్టీమోడల్ లాజిస్టిక్ వ్యవస్థ ప్రతి నగరానికి భవిష్యత్తు.. విశాఖపట్నం ఆ దిశలో ఒక అడుగు ముందుకు వేసింది' అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఇలా అరగంటకు పైగా సాగిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో విశాఖ గురించే ఎక్కువగా ప్రస్తావించారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ప్రధానికి ఆహ్వానం



ప్రధానికి అభివాదం చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలు 2023 ఏప్రిల్‌లో ప్రారంభమవుతాయని వీటిని ప్రారంభించడానికి రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి కోరారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో బహిరంగ సభలో పాల్గొనడానికి వచ్చిన ప్రధానిని వీసీ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్ సీఆర్ రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, నోబెల్ గ్రహీత సీవీ రామన్, ఆచార్య సూరి భగవంతం వంటి మహనీయులు ఏయూను మలిచిన విధానాన్ని ప్రధానికి వీసీ వివరించారు. నేడు ప్రధాని, ముఖ్యమంత్రి ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయం అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందుతోందన్నారు. మేకిన్ ఇండియా ఆశయాన్ని కార్యరూపంలో చూపే దిశగా జరుగుతున్న కృషిని వివరించారు. గతంలో ప్రధానమంత్రులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్, వాజ్‌పేయి, రాష్ట్రపతులు అబ్దుల్ కలాం, రామ్‌నాథ్ కోవింద్‌లు వివిధ సందర్భాల్లో ఏయూను సందర్శించారని వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డిని పరిచయం చేశారు.

రుషికొండలో చిలకా గోరింక విహారయాత్ర

- పీఎంతో రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించకపోగా.. వేధిస్తున్నారని సానుభూతి కోసం నటన
- పవన్‌కు రాజకీయ పొత్తు టీడీపీతోనే శాశ్వతం
- ప్రధాని సభ విజయవంతమవ్వడంతో డైవర్ట్ చేయడానికే రుషికొండకు పవన్
- జనసేనను బంగాళాఖాతంలో ముంచేది నాదండ్ల మనోహరే..
- మీడియాతో ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మీడియాతో మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్‌లో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభ జరిగితే దాన్ని డైవర్ట్ చేయడానికే రుషికొండలో విహారయాత్రకు చిలక గోరింకలిద్దరూ వెళ్లారని పవన్‌పై గుడివాడ అమర్‌నాథ్ విరుచుకుపడ్డారు. చాలాకాలం తర్వాత ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడటం మానేసి, సానుభూతి పొందేలా బాగా నటించారని అమర్ వ్యాఖ్యానించారు. తమను వేధిస్తున్నారంటూ ప్రధానికి చెప్పి సానుభూతి పొందాలనుకుని పవన్ చతికిలపడ్డారన్న విషయం మీడియాతో మాట్లాడిన విధానం బట్టి అర్థమవుతుందన్నారు. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ మోదీ ముందు చదవాలని పవన్ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. దీనవదనంతో ఏదో సంతాప సభలో మాట్లాడినట్టు ఆయన ముఖ కవళికలనుబట్టి అర్థం అవుతోందన్నారు. పవన్‌కు రాజకీయ పొత్తు టీడీపీతోనన్నారు. మద్దిలపాలెం పార్టీ నగర కార్యాలయంలో మంత్రి అమర్‌నాథ్ శనివారం మీడియాతో మాట్లాడారు. తాను రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్లలో ఇంతటి భారీ బహిరంగ సభ ఈ ప్రాంతంలో చూడలేదన్నారు. ఈ సభకు సుమారు రెండున్నర నుంచి మూడు లక్షల మంది జనం హాజరయ్యారన్నారు. లక్షలాదిమంది సభకు తరలివచ్చినా, జనం లేరంటూ కొంతమంది చేసిన వ్యాఖ్యలు వారి విజ్ఞతకే వదిలిపెడుతున్నామని పేర్కొన్నారు. ఎవరేమనుకున్నా.. ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందని, అన్నిటికీ మించి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ సభలో ప్రసంగించిన తీరు అద్భుతమన్నారు. రాజకీయ ప్రయోజనాల కన్నా.. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని సీఎం చెప్పిన తీరు హుందాగా ఉందని మంత్రి పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలను ఈ సభలో సీఎం ప్రస్తావించారని, పోలవరం, రైల్వే జోన్, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, విభజన హామీలపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారని అమర్నాథ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్రం తరపున అనుకున్న విధంగానే గౌరవ మర్యాదలు అందించామని, మోదీని కలిసినప్పుడల్లా రాష్ట్ర అంశాల మీద సీఎం చర్చిస్తూనే ఉన్నారన్నారు. కానీ ఎల్లో మీడియా దీనిని అర్థం చేసుకోలేకపోతోందని అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరైన నిర్ణయం తీసుకుంటారన్న నమ్మకం ఉందన్నారు.

చిలక..గోరింకలిద్దరూ ఎవరు...? అని మీడియా ప్రశ్నకు సమాధానంగా ..అమర్‌నాథ్ మాట్లాడుతూ...ఇప్పుడే కాదు ఎప్పటికైనా పవన్ కల్యాణ్‌ను, ఆయన పార్టీని బంగాళాఖాతంలో కలిపేది..గోరింకైన నాదెండ్ల మనోహరే అని అన్నారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ నగర ఎస్సీసెల్ ప్రెసిడెంట్ బోని శివరామకృష్ణ, అనకాపల్లి జిల్లా మార్కెట్ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైఎస్సార్ సీపీ ముఖ్యనేత బొక్కర శేఖర్ తదితరులున్నారు.

విహారంలో విషాదం

- వంజంగి హిల్స్ సందర్శనకు బులెట్‌పై వస్తుండగా ప్రమాదం
- కల్వర్టు గొయ్యిలోకి దూసుకెళ్లిన వాహనం
- తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే యువకుడి మృతి
- స్వల్పగాయాలతో బయటపడిన మరో యువకుడు


కల్వర్టులోకి దూసుకుపోయిన బులెట్ వాహనం


సాయిసిద్ధార్థ్ మృతదేహం

సాక్షి, పాడేరు: వంజంగి హిల్స్ సందర్శనకు బులెట్ వాహనం వస్తున్న పర్యాటకుడు నిర్మాణంలో ఉన్న కల్వర్టు గొయ్యిలోకి దూసుకుపోయి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం వెనుక కూర్చున్న మరో యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడు విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన బీటెక్ విద్యార్థి బొబ్బిలి సాయిసిద్ధార్థ్ (23)గా గుర్తించారు. స్నేహితులతో కలిసి వంజంగి హిల్స్‌ను వీక్షించేందుకు శుక్రవారం రాత్రి ఎస్.కోటలో రెండు బైక్‌లపై బయలుదేరారు. తెల్లవారు జామున పాడేరు చేరుకున్నారు. వేకువజామునే బులెట్ వాహనంపై సిద్ధార్థ్, అతని స్నేహితుడు కాకర రవికుమార్ ముందుగా వంజంగి హిల్స్‌కు బయలుదేరారు. లగిశపల్లి గ్రామం నుంచి కుడివైపు రోడ్డులో వంజంగి హిల్స్‌కు ప్రధాన రోడ్డు. అయితే సిద్ధార్థ్ మాత్రం గురిపల్లి రోడ్డు వైపు వెళ్లడంతో అక్కడ నిర్మాణ దశలో ఉన్న కల్వర్టు గోతిలోకి బులెట్ దూసుకువెళ్లింది. ఇద్దరు గోతిలో పడిపోయారు. సిద్ధార్థ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రవికుమార్ తేలికపాటి గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. తెల్లవారు నాలుగు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానిక గిరిజనులు సహాయక చర్యలు చేపట్టారు. ఎస్ఐ లక్ష్మణ్ ఉదయాన్నే సంఘటన స్థలానికి చేరుకున్నారు.సిద్ధార్థ్ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురికి తరలించారు.ఎస్.కోటలో ఉన్న మృతుడి తండ్రి శ్రీనివాస్‌కు పోలీసులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులంతా ఇక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

బైక్‌పై వెళ్లి.. సమస్యలు తెలుసుకుని ..


ఏవోబీ ప్రాంతమైన కొజిరిగూడకు ప్రైవేట్ జీపులో వెళ్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్


బైక్‌పై వెళ్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

- ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- వారపు సంతలో కమీషన్ తీసుకొని నగదు చెల్లింపులపై ఆగ్రహం
- ప్రైవేట్ వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఎస్ఐకు ఆదేశం

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో అత్యంత మారుమూల గిరిజన గ్రామాల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని భూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో 104 సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. గర్భిణుల వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని 104 వైద్యాధికారి గీతాంజలికు సూచించారు. అక్కడ నుంచి పెదబయలు మండలం జామిగూడ పంచాయతీ కేంద్రానికి వెళ్లారు. అక్కడి గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై తెలుసుకున్నారు. అనంతరం కొజిరిగూడ వరకు స్థానిక గిరిజనులతో కలిసి ప్రైవేట్ జీపులో ప్రయాణించారు. రహదారి, తాగునీరు, పాఠశాల భవనాలు, వైద్య సేవలపై గిరిజనులతో చర్చించారు. గుంజివాడ వద్ద వాగుపై కొత్తగా నిర్మించిన వంతెనను పరిశీలించారు. కొజిరిగూడ గిరిజనులు వాగు కష్టాలు తొలగిపోయిన సంతోషంతో కలెక్టర్‌కు పూలమాలల వేసి సత్కరించారు. నీటితో కాళ్లు కడిగి ఘన స్వాగతం పలికారు. కొజిరిగూడ గ్రామ గిరిజనుల సమస్యల తెలుసుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో భూసిపుట్టు మార్గంలో బయలుదేరారు. తారాబు జలపాతానికి వెళ్లే మార్గం, పర్యాటకుల సమస్యలను ఆయన స్థానిక గిరిజనుల నుంచి తెలుసుకున్నారు. భూసిపుట్టు– తారబు వరకు 3 కిలో మీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని గిరిజనులకు కలెక్టర్ తెలిపారు.

కమీషన్ వసూలుపై ఆగ్రహం

ముంచంగిపుట్టు వారపు సంతలో ఆధార్‌తో నగదు చెల్లింపులను కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఎటువంటి అనుమతి లేని ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు కమీషన్ తీసుకుని నగదు చెల్లించాడాన్ని గుర్తించిన ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి నుంచి నుంచి సాంకేతిక పరికరాలను కలెక్టర్ స్వాధీనం చేసుకొని ఎస్ఐ రవీంద్రకు అప్పగించారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఎస్‌బీఐ, గ్రామీణ వికాస్ బ్యాంకులకు వెళితే నగదు ఇవ్వడం లేదని గిరిజనులు కలెక్టర్‌కు వివరించారు. బయట పేమెంట్ చేసే వ్యక్తుల వద్ద తీసుకోవాలని, ఏటీఎంలో సైతం నగదు ఉండటం లేదని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ రెండు బ్యాంకుల మేనేజర్లలో మాట్లాడి నిత్యం నగదు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జమిగూడ,తారబు,జడిగూడ,గుంజివాడ,కోజిరిగూడ,పినరవిల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులు వారానికి ఒక్కరోజు వస్తున్నారని అయా గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిరార్యదు చేశారు. జమిగూడ పంచాయతీలో తాగు నీటి పథకం పనులు చేపట్టాలని ఆదేశించారు. జమిగూడ వద్ద రూ..2.20 కోట్లతో బ్రిడ్జి పనులు వేగంగా ప్రారంభించి మార్చినాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

కొనసాగుతున్న
కనిష్ట ఉష్ణోగతలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.పాడేరు మండలం మినుములూరులో 14.5డిగ్రీలు,చింతపల్లిలో 15.4 డిగ్రీలు,అరకులోయలో 16.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి.పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో సూర్యోదయం ఆలస్యమవుతోంది.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం


డ్రైవర్ నుంచి ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు శనివారం ఘాట్‌రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరంలో మధ్యాహ్నం బయలుదేరిన బస్సు సాయంత్రం చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌రోడ్‌లో వెళ్తోంది. దుర్గగుడి సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో బస్సు అదుపుతప్పింది. ఈ సమయంలో డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి లోయలోకి పడకుండా చాకచక్యంగా కొండవైపున ఉన్న కల్వర్టుకు ఢీ కొట్టడంతో నిలిచిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. అదే సమయంలో చింతూరు నుంచి రంపచోడవరం వెళ్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రమాద సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఇతర వాహనాల్లో వారిని గమ్యస్థానాలకు చేర్చాలని ఆమె సూచనలిచ్చారు.

వీకెండ్ సందడి


కొత్తపల్లి జలపాతం వద్ద భారీగా పర్యాటకులు

సాక్షి,పాడేరు: మన్యంలోని ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు శనివారం పోటెత్తారు. వరుసగా రెండు రోజులు సెలవులు కావడంతో పర్యాటకులంతా సందర్శనకు తరలివచ్చారు.


చాపరాయి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి శనివారం పర్యాటకులు పోటెత్తారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు విద్యా సంస్థలకు సెలవు కావడంతో అనేక ప్రాంతాల నుంచి ప్రత్యేకవాహనాల్లో తరలివచ్చారు.

మారేడుమిల్లి : జలతరంగిణి, అమృతధార, జంగిల్ స్టార్, పాములేరు, వ్యూపాయింట్, వాలిసుగ్రీవ్ వన మూలికల ప్రదేశం, కాఫీతోటలు, తదితర పర్యాటక ప్రదేశాలు, అతిథి గృహాలు పర్యాటకులతో నిండిపోయాయి.

దుంబ్రిగుడ: చాపరాయి జలపాతం మైదాన ప్రాంతం నుంచి వచ్చిన పర్యాటకులతో సందడిగా మారింది.


జలతరంగిణి జలపాతం వద్ద పర్యాటకులు

బొర్రా గుహలకు రూ.2.45 లక్షల ఆదాయం

అనంతగిరి:మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు శనివారం పర్యాటకులు పోటెత్తారు. సుమారు 7వేల మంది తిలకించారు. రూ. 5.45 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.


గుహల అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

హుకుంపేట: క కేంద్రం మత్స్యగుండం సందర్శనకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు.

క్లుప్తంగా

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆరిలోవ(విశాఖ తూర్పు): గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలు జిల్లాలో అన్ని పాఠశాలల్లో ప్రతి రోజూ నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత గురించి ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. రోజూ నిర్వహించాల్సిన కార్యక్రమాల షెడ్యూల్‌ను పాఠశాలలు, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలకు పంపించినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి జావెలిన్‌త్రో పోటీల్లో వీఆర్‌వో ప్రతిభ

రావికమతం: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి జావెలిన్‌త్రో పోటీల్లో రావికమతం మండలం జెడ్.కొత్తపట్నం వీఆర్‌వో ఆర్.రాజేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచాడు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో శనివారం జరిగిన పోటీల్లో 13 జిల్లాల నుంచి రెవెన్యూ సిబ్బంది పాల్గొనగా రాజేష్ 33.4 మీటర్ల దూరం జావెలిన్‌త్రో చేసి విజేతగా నిలిచాడు. వారం రోజుల క్రితం విశాఖలో జరిగిన పోటీల్లో 33 మీటర్లు విసిరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాజేష్‌ను తహసీల్దార్ మహేశ్వరరావు,డిప్యూటీ తహసీల్దార్ శేషు, వీఆర్‌వోల అసోసియేషన్ నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి బూరవు సత్తిబాబు అభినందించారు.


వీఆర్‌వో రాజేష్

నేటి నుంచి యూత్ క్వాడ్రేంగులర్ టీ20

విశాఖ స్పోర్ట్స్: క్వాడ్రేంగులర్ టీ20 సిరీస్‌లో భాగంగా మూడు దేశాల యూత్ మహిళా జట్లు ఆదివారం నుంచి వైఎస్ఆర్ స్టేడియంలో తలపడనున్నాయి. వెస్టిండీస్, శ్రీలంక జట్లతో పాటు భారత్ ఏ, బీ అండర్-19 మహిళా జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. ఇప్పటికే ఈ నాలుగు జట్లు వైఎస్ఆర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేశాయి. భారత్ ఏ జట్టును శ్వేతా శెర్వార్, బీ జట్టును నికీ ప్రసాద్ ముందుకు నడిపించనున్నారు. వైస్ కెప్టెన్లుగా సౌమ్యా తివారీ, నజ్లా వ్యవహరించనున్నారు. ఆయా తేదీల్లో రెండేసి మ్యాచ్‌లు జరగనుండగా.. ఫైనల్స్ ఈ నెల 19న జరగనుంది.

మ్యాచ్‌ల వివరాలిలా..

తేదీ	ఎవరితో ఎవరు
13	భారత్-ఏ-వెస్టిండీస్
	భారత్-బీ-శ్రీలంక
15	వెస్టిండీస్-శ్రీలంక
	భారత్-ఏ-భారత్-బీ
17	భారత్-ఏ-శ్రీలంక
	భారత్-బీ-వెస్టిండీస్

నగరంలో నేడు

- ఉదయం 7 గంటల నుంచి లాసన్స్‌బే టర్ఫ్ వద్ద జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జిటో) ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు
- ఉదయం 4.15 గంటల నుంచి బీచ్‌రోడ్‌లోని విశ్వప్రియ హాల్ వద్ద కాళీమాత ఆలయం సమీపంలో వైజాగ్ నేవీ మారథాన్
- ఉదయం 10 గంటల నుంచి బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్ కాలనీ(51వ వార్డు), పెదగంట్యాడ ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్, మధురవాడ వాంబే కాలనీ, వెల్లంకి, భీమిలి రెల్లి కాలనీల్లో ఎస్సీకాలనీల సందర్శన
- ఉదయం 10 గంటల నుంచి నోవాటెల్‌లో ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ప్రదర్శన
- మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎంవీపీకాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద కార్తీక దీపోత్సవం

కోవిడ్-19 అప్‌డేట్



విశాఖ జిల్లాలో శనివారం ఒక్క కేసూ నమోదు కాలేదు. 8 మంది చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 1,44,531మంది కోవిడ్ బారిన పడ్డారు. ఇంతవరకు 1,43,367మంది కోలుకున్నారు. మొత్తం మృతుల సంఖ్య 1156కు చేరుకుంది

-మహారాణిపేట(విశాఖ దక్షిణ)

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,580
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.48,200
వెండి(కిలో):	రూ.67,500

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	510.00
విజయనగరం	514.00
శ్రీకాకుళం	514.00

ఉపాధికి రాచమార్గం

- మహిళా ప్రాంగణంలో శిక్షణలు పునః ప్రారంభం
- రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల నర్సింగ్ కోర్సు


జిల్లా మహిళా ప్రాంగణం


ఐసీయూలో రోగికి అందించాల్సిన సేవలపై అవగాహన


తరగతి గదిలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): గ్రామీణ యువతకు జిల్లా మహిళా ప్రాంగణంలో శిక్షణ తరగతులు పునః ప్రారంభమయ్యాయి. కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్ల పాటు ఎలాంటి శిక్షణలు లేక బోసుపోయిన ప్రాంగణం కొద్ది నెలలుగా కళకళలాడుతోంది. పైనాపిల్ కాలనీలో జిల్లా మహిళా ప్రాంగణం ఉంది. 1986లో ప్రారంభమైన ఈ ప్రాంగణంలో 2019 వరకు నిరాటంకంగా శిక్షణ కొనసాగాయి. దీంట్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో నగరంతో పాటు అరకు, పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం, గ్రామీణ ప్రాంతాల నుంచి వేలా మంది మహిళలు చేతి వృత్తులు, కంప్యూటర్స్, నర్సింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ పొందేవారు. కరోనా మహమ్మారి కారణంగా ఈ శిక్షణ తరగతులకు బ్రేక్‌లు పడ్డాయి. 2020 మార్చి నుంచి ఇప్పటి వరకు సుమారు రెండున్నరేళ్ల పాటు ఇక్కడ ఎలాంటి శిక్షణలు జరగలేదు.

రెడ్డీస్ ఫౌండేషన్‌తో ఒప్పందం

ప్రస్తుతం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతులకు నర్సింగ్ విభాగంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కూడా కల్పించనున్నారు. ఏడాది పాటు నాలుగు బ్యాచ్‌లు నిర్వహించడానికి రెడ్డీస్ ఫౌండేషన్ మహిళా ప్రాంగణంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబరు 19న మొదటి బ్యాచ్ ప్రారంభమైంది. ప్రతి బ్యాచ్‌కు మూడు నెలలు పాటు శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం ఇక్కడ 67 మంది యువతులు శిక్షణ పొందుతున్నారు. రెడ్డీస్ ల్యాబ్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సెంటర్ మేనేజర్ సీహెచ్ అరుణశ్రీ ఆధ్వర్యంలో ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్లు(శిక్షకులు) శిక్షణ ఇస్తున్నారు. జనరల్ డ్యూటీ అసిస్టెన్స్(జీడీఏ)పై అవగాహన కల్పిస్తున్నారు. మూడు నెలల పాటు ఇస్తున్న ఈ శిక్షణలో థియరీతో పాటు ప్రాక్టికల్ కూడా నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలో రోగులకు ఏవిధంగా సేవలు అందించాలో వివరిస్తున్నారు. బీపీ, టెంపరేచర్ చెక్ చేయడం, రక్త పరీక్షలు కోసం సాంపిల్ సేకరించడం, కార్డియో పల్మనరీ రిసెటేషన్(సీపీఆర్) చేయడం, ఐసీయూలో బెడ్‌పై ఉన్న పేషెంట్‌కు చేయాల్సిన పరీక్షలతో పాటు అత్యవసర సమయాల్లో ఎలాంటి సేవలు అందించాలి, తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నారు. ప్రాక్టికల్స్‌లో భాగంగా విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)కు తీసుకెళ్లి అక్కడ రోగులకు ప్రత్యక్షంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఐసీయూలో ఉన్న రోగుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నేరుగా నేర్పుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉపాధి



మూడు నెలల పాటు ఇక్కడ నిర్వహిస్తున్న జీడీఏ కోర్సులో చేరడానికి 18 సంవత్సరాలు నిండి ఉండాలి. ఇంటర్మీడియట్ పూర్తి చేసినవారికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నాం. నర్సింగ్ వృత్తికి అవసరమైన మెలకువలు నేర్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసిన వారికి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఉద్యోగ అవకాశం కల్పించనుంది. గతంలో కోర్సు పూర్తి చేసిన చాలా మంది అభ్యర్థులు పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు సంపాదించారు. - వై.లలిత, ఎల్.సుభాషిణి, శిక్షకులు

శిక్షణ కొనసాగేలా ప్రయత్నం



మహిళా ప్రాంగణంలో 2019 వరకు నిరాటంకంగా శిక్షణలు కొనసాగేవి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు పలు చేతి వృత్తుల్లో శిక్షణ పొందారు. వీరిలో చాలా మంది ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇంకొందరు సొంతంగా ఉపాధి పొందుతున్నారు. ఇప్పుడు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ముందుకు రావడంతో శిక్షణ తరగతులు పునః ప్రారంభమయ్యాయి. మళ్లీ నిరంతరం శిక్షణలు కొనసాగడానికి ప్రయత్నిస్తున్నాం.

- పైల విమల, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్

'ఐపీఆర్'పై సదస్సు రేపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్) ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో 'ఐపీఆర్-కీ ఫర్ అకడమిక్ ఇండస్ట్రియల్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఏపీ' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల సౌజన్యంతో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ, ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్‌డీసీ, ఆ-హబ్, నోవెల్ పేటెంట్స్, ఏఎంటీజెడ్, ఎస్‌టీపీఐ, ఏయూ-ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. సదస్సులో భాగంగా ఐపీ బడ్డీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌ను మంత్రి ప్రారంభిస్తారని తెలియజేశారు. ఐపీ రంగంలో సందేహాలను నివృత్తి చేసే, తగిన సూచనలు అందించే విధంగా నిరంతరం పని చేసే వాట్సాప్ సేవలను ప్రారంభిస్తారని తెలిపారు. సదస్సులో పాల్గొనే వారు పూర్తి సమాచారం కోసం 95992 29217 నంబరులో సంప్రదించాలని కోరారు.

15న జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

తగరపువలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ఈ నెల 15న నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని ఫెడరేషన్ జిల్లా నిర్వాహక కార్యదర్శి చిల్ల వెంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను చిట్టివలసలో శనివారం తెలియజేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు ఎంపిక పోటీలో పాల్గొనవచ్చన్నారు. అండర్ - 14 కేటగిరీలో పాల్గొనదలచినవారు 01.01.2009 తర్వాత, అండర్ - 17 కేటగిరీలో పాల్గొనదలచినవారు 01.01.2006 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఎలిజిబిలిటీ ఫారం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 98664 01002లో సంప్రదించాలని కోరారు.

న్యుమోనియా నివారణతో బాల్యానికి భరోసా

- డీఎంహెచ్‌వో విజయలక్ష్మి
- క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి,చిత్రంలో వైద్యులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): బాలలు ప్రశాంతంగా ఊపిరి తీసుకోవాలంటే వారిలో న్యుమోనియా లక్షణాలను వెంటనే గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సూచించారు. న్యుమోనియా నివారణే బాల్యానికి భరోసా పేరుతో అన్ని ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ నెల 12వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పిల్లల బాల్యాన్ని ఊపిరి పీల్చుకోనిద్దాం' నినాదంతో ఈ ఏడాది క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. న్యుమోనియా అంటే ఏమిటి, బిడ్డ శ్వాసను ఎలా లెక్కించాలి, న్యుమోనియా ఎలా వ్యాప్తి చెందుతుంది, న్యుమోనియా నుంచి సురక్షితంగా ఉంచాలంటే ఏం చేయాలనే అంశాలపై డీఎంహెచ్‌వో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ (డీఐవో) డాక్టర్ జీవన్‌రాణి, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రరావు, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డిమో)బి.నాగేశ్వరరావు, మల్టీ పర్పస్ హెల్త్ ఎడ్యుకేటర్ నాగభూషణం, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మిరాకిల్ టాలెంట్ హంట్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ, మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో 'మిరాకిల్ లిటిల్ చాంప్స్-2022' పేరిట టాలెంట్ హంట్ నిర్వహించనున్నట్లు మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా ఈ నెల 13న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, 14న మధ్యాహ్నం 1.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలుంటాయని పేర్కొన్నారు. పోటీలకు సంబంధించి 99664 85335 నంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని షకీల్ సూచించారు.

మూడు భాషల్లో పుస్తకావిష్కరణ


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రచయిత ఎల్.ఆర్.స్వామి

సీతంపేట (విశాఖ ఉత్తర): ప్రముఖ కవి రొక్కం కామేశ్వరరావు తమిళం, తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రచించిన మూడు కవితా సంపుటాలను ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎల్.ఆర్.స్వామి శనివారం ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సభలో ప్రముఖ సాహితీ విశ్లేషకులు ఎల్.ఆర్.స్వామి తమిళంలో అనువదించిన 'అంతర్మథనం' పుస్తకాన్ని సమీక్ష చేశారు.

ఇన్నర్ విజన్ ఆంగ్లానువాదాన్ని బుల్లయ్య కళాశాల ప్రొఫెసర్ వి.రాధాదేవి, ముఖారి తెలుగు కవితను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి అజశర్మ సమీక్షించారు. అనంతరం రచయిత రొక్కం కామేశ్వరరావు స్పందిస్తూ తన అనుభవనాలను, కవిత్వ చైతన్య తత్వాన్ని వివరించారు. అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ఎస్.హనుమంతరావు, కె.మధుసూదన్, శేఖరమంత్రి ప్రభాకర్, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎత్తుకు పైఎత్తు

- ఆధిక్యానికి స్వప్నిల్, విఘ్నేష్, హిమాల్
- తడపడుతున్న ఆతిథ్య జట్టు


జీఎం ఎత్తులకు పైఎత్తులు వేస్తున్న ఐఎంలు


సప్తర్షి ఎత్తుకుపైఎత్తు వేసి చిత్తుచేసిన హిమాల్ (నల్లటీషర్టులో)

విశాఖ స్పోర్ట్స్: రైల్వే శుభమ్ హాల్‌లో శనివారం జరిగిన ఆల్ ఇండియా రైల్వే చదరంగం వ్యక్తిగత చాంపియన్‌షిప్ ఎత్తుకు పైఎత్తులతో సాగింది. ఈ టోర్నీలో ఆధిక్యానికి స్వప్నిల్‌తో విగ్నేష్ ఆరో రౌండ్‌లో తలపడ్డాడు. ఐదో రౌండ్‌లో టాపర్‌గా కొనసాగుతున్న స్వప్నిల్ డ్రాగా ముగించగా.. విఘ్నేష్‌తో సహా హిమాల్ ఐదో రౌండ్‌లో విజయాలందుకోవడంతో ఈ ముగ్గురు నాలుగున్నరేసి పాయింట్లతో ఐదో రౌండ్ ముగించారు. ఇక దీపన్, శ్యామ్‌నిఖిల్, ప్రవీణ్, కార్తీకేయన్, ఆరింథమ్, లక్ష్మణ్ నాలుగేసి పాయింట్లతో ఆరో రౌండ్‌కు సిద్ధమయ్యారు. ఈ టోర్నీ టాప్ ర్యాంకర్ విశాఖ్ ఐదో రౌండ్‌ను డ్రాగా ముగించడంతో మూడున్నర పాయింట్లతో వెనుకబడిపోయాడు.

సత్తా చాటుతున్న స్వప్నిల్

రెండో ర్యాంక్‌తో టోర్నీకి ఎంట్రీ ఇచ్చిన గ్రాండ్‌మాస్టర్ స్వప్నిల్ ఆరో రౌండ్‌కు టాప్ బోర్డ్‌పైనే కొనసాగాడు. నాలుగు రౌండ్లలో విజయంతో పాటు, ఐదో రౌండ్‌ను కూడా డ్రాగా ముగించాడు. టోర్నీ టాప్ ర్యాంకర్ విశాఖ్ తొలి రౌండ్‌లోనే కంగుతిని ఆరో రౌండుకు మూడున్నర పాయింట్లతో ఆటకు సిద్ధపడ్డాడు.

తడబడుతున్న జీఎంలు

టాప్ ర్యాంకర్ జీఎం విశాఖ్ కేవలం మూడున్నర పాయింట్లతోనే ఆరో రౌండ్‌కు చేరుకోగా.. జీఎంలు లక్ష్మణ్, కార్తీకేయన్, దీపన్ చక్రవర్తి నాలుగేసి పాయింట్లతోనే ఆరో రౌండ్‌కు సిద్ధపడ్డారు. జీఎంలు తేజ్‌కుమార్, సప్తర్షి మూడేసి పాయింట్లతో వెనుకబడ్డారు.

ఆతిథ్య జట్టు ఇలా..

ఈ టోర్నీ ఆరోరౌండ్‌లో 78 మంది ఆటగాళ్లు తలపడుతుండగా.. ఆతిథ్య ఈకోర్సా జట్టు ఆటగాళ్లు ఎత్తుకు పైఎత్తులు వేయడంలో తడపడుతున్నారు. టోర్నీలో 53వ ర్యాంక్‌తో ఆటను మొదలెట్టిన రమణబాబు, 58వ ర్యాంకర్ విజయకుమార్ రెండున్నరేసి పాయింట్లు సాధించి ఆరో రౌండ్‌కు చేరారు. 63వ ర్యాంకర్ యువకిషోర్, 70వ ర్యాంకర్ రాజబాబు రెండేసి పాయింట్లతో ఆరో రౌండ్‌కు సిద్ధపడ్డారు. 69వ ర్యాంకర్ చలపతిరావు ఐదో రౌండ్‌లో పరాజయంతో ఒకటిన్నర పాయింట్లతోనే ఆటను కొనసాగిస్తున్నాడు. ఏడో రౌండ్‌తో ఈ పోటీలు ముగియనున్నాయి.

అక్రమాలు జరిగాయంటూ హంగామా

- జగనన్న కాలనీల సందర్శనలో జనసేన
- లబ్ధిదారుల నుంచి కానరాని స్పందన


పైడివాడ అగ్రహారంలోని అర్బన్ హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలిస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకరరావు

సాక్షి, విశాఖపట్నం: జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయంటూ జనసేన పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు శనివారం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలో కొన్నిచోట్ల ఆయా లే అవుట్లను సందర్శించారు. అనర్హులకు ఇళ్లు కేటాయించారని, కాలనీల్లో సదుపాయాలు లేవంటూ అక్కడక్కడ హంగామా చేశారు. అయితే ఆయా కాలనీల లబ్ధిదారుల నుంచి ఆశించిన స్పందన కానరాలేదు. ఆది, సోమవారాల్లోనూ జనసేన నాయకులు తమ సందర్శనను కొనసాగించనున్నారు. అనంతరం పార్టీ అధినేతకు నివేదికను సమర్పించనున్నారు.

- విశాఖ నగరం పెదజాలరిపేటలోని టిడ్కో ఆదర్శ గ్రామం వద్ద ఆ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, 45వ వార్డు ఏఎస్సార్‌నగర్‌లో జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు టిడ్కో ఇళ్లను సందర్శించి అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. గాజువాక దయాళ్‌నగర్‌లో టిడ్కో ఇళ్లను జనసేన పార్టీ నాయకులు సందర్శించారు.
- జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, అనకాపల్లి ఇన్‌చార్జి పరచూరి భాస్కరరావు పిసినికాడ బీఆర్టీ కాలనీలో టిడ్కో గృహాలను, లే అవుట్లను పరిశీలించారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో అర్బన్ హౌసింగ్ లే అవుట్‌ను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకరరావు సందర్శించారు. యలమంచిలి మండలం ఎర్రవరం వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ సందర్శించారు. నర్సీపట్నంలో టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ లే అవుట్లను అక్కడి ఇన్‌చార్జి సూర్యచంద్ర పరిశీలించారు.

రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్జిబిషన్ పురోహిత్, యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు

చోడవరం : ఆరోగ్య రక్షణకు ప్రతీ ఒక్కరూ యోగా చేయాలని ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్జిబిషన్ పురోహిత్ అన్నారు. 35వ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్ షిప్ పోటీలు చోడవరం పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ విద్యాసంస్థల ఆవరణలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. చోడవరం పతంజలి యోగా కేంద్రం గురువు, రాష్ట్ర అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పుల్లేటి సతీష్ పర్యవేక్షణలో పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశారు. 8 నుంచి 80 ఏళ్ల వయస్సు కలిగిన, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 300 మంది యోగా క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సభలో ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్జిబిషన్ పురోహిత్ మాట్లాడుతూ భారతదేశం ఇప్పుడు యోగాలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఫెడరేషన్ల ద్వారా గ్రామస్థాయి వరకూ యోగా గురించి తెలియజేయడంతోపాటు శిక్షణ ఇచ్చేందుకు కృషిచేస్తున్నారన్నారు. చోడవరం వంటి గ్రామంలో పతంజలి యోగా కేంద్రం ఏర్పాటు చేసి ఎందరికో యోగా నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కోన కృష్ణదేవరాయులు మాట్లాడుతూ పట్టణాలతోపాటు, గ్రామీణ ప్రజలు కూడా యోగాపై ఆసక్తి చూపుతున్నారన్నారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు మాట్లాడుతూ యోగా మంచి మందుగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ యోగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బోనాలు చక్రవర్తి, రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి అల్లాడ రవికుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, డాక్టర్ బండారు సత్యనారాయణ, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, యోగా కేంద్రం అధ్యక్షుడు పసుమర్తి అశోక్ పాల్గొన్నారు.

మొదటి రోజు రెండు విభాగాల్లో..


రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో మొదటి రోజు రెండు విభాగాల్లో యోగా క్రీడాకారులు పోటీపడ్డారు. బాలికలు, బాలురు విభాగాల్లో వేర్వేరుగా పోటీలు జరిగాయి. 8-14 సంవత్సరాల వయస్సు బాలికల విభాగంలో 70మంది, బాలుర విభాగంలో 60మంది పోటీ పడ్డారు. 14-20 విభాగంలో బాలికలు 40, బాలురు 32మంది పోటీపడ్డారు.

అందాల లోగిలిలో ఆనందాల హరివిల్లు

జగనన్న కాలనీలతో పేదల సొంతింటి కల సాకారం


కురపల్లి జగనన్న కాలనీలో ఇళ్లు


కురపల్లి జగనన్న కాలనీలో చూడముచ్చటగా ఉన్న ఇల్లు


కృష్ణాపురం జగనన్న కాలనీలో ఇళ్లు

పద్మనాభం: పేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో నేరవేరింది. గత ప్రభుత్వానికి భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి లక్షలాది రూపాయల విలువ చేసే స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీలను నిర్మింపజేయడంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకముందు సొంతిళ్లు లేక అధిక శాతం మంది పూరి పాకల్లో నివసిస్తూ దుర్భరమైన జీవనం గడిపేవారు. కొంత మంది అద్దె ఇళ్లలో ఉంటూ నెలవారీ అద్దె కట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవారు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇళ్లు మంజూరు చేశారు. 24 లే అవుట్లలో 2,391 మందికి కాలనీ ఇళ్లు మంజూరు చేశారు. ఈ ఇళ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయల విలువ చేసే 49.21 ఎకరాలు కేటాయించారు. వీటిలో 820 ఇళ్లు బేసిమెంట్, 90 ఇళ్లు రూఫ్‌లెవల్, 191 శ్లాబు లెవెల్లో ఉన్నాయి. 214 ఇళ్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ కాలనీ ఇంటి నిర్మాణానికి గృహ నిర్మాణ పథకం కింద రూ.1.50 లక్షలు, ఉపాధి హామీ పథకం కింద రూ.30 వేలు, లబ్ధిదారు స్వయం సహాయ సంఘ సభ్యులైతే పావలా వడ్డీకి రూ.35వేలు మంజూరు చేస్తున్నారు. ఇవే కాకుండా అదనంగా 20 టన్నుల ఇసుక ఉచితంగా సరఫరా చేస్తున్నారు. సిమెంటు 90 బస్తాలు, 485 కిలోల ఇనుము తక్కువ ధరకు అందిస్తున్నారు. తలుపులు, కిటికీలు ఫ్రేమ్‌లు, టాయిలెట్ల డోర్లు, పెయింట్లు, వాటర్ ట్యాంకులు, విద్యుత్ తలుపుల షట్టర్లు, శానిటరీ ఐటమ్ పైపులు తక్కువ ధరకు ఇస్తున్నారు. వీటికితోడు 5.వేలు విలువ చేసే సర్వీసు వైరుతో మీటరు బోర్డు ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేస్తుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇవన్నీ మంజూరు చేసి లబ్ధిదారుడికి కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని సులభతరం చేసింది. దీంతో లబ్ధిదారులు కూడా ఇళ్లు జోరుగా నిర్మించుకుంటున్నారు.

ఉచితంగా రూ.7 లక్షల స్థలం



కురపల్లి వద్ద పద్మనాభం - మహరాజుపేట మార్గంలో ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని కాలనీ ఇళ్ల నిర్మాణానికి రూ.7లక్షలకు పైగా విలువ చేసే స్థలం ఇచ్చారు. గతంలో తాము పాండ్రంగిలో చిన్న ఇంటిలో తొమ్మిది మందిమి ఉండేవారం. ఆ స్థలం చాలకపోవడంతో ఇబ్బంది పడేవారం. ప్రభుత్వం స్థలం ఇవ్వడంతో జగనన్న కాలనీ ఇళ్లు నిర్మించుకున్నాం. స్థలంతో కలిపి ఇంటి విలువ రూ.18 లక్షలు ఉంటుంది. ప్రస్తుతం ఇంటిలో దిగిపోయాం.

- పి.నూకరత్నం, కురపల్లి జగనన్న కాలనీ

అద్దె బాధ తప్పింది



మాది విజయనగరం జిల్లా జామి మండలం జామి గ్రామం. బతుకుతెరువు కోసం పదేళ్ల కిందట పద్మనాభం వలస వచ్చాం. ఇక్కడ అద్దె ఇంటిలో ఉండేవారం. నెలకు రూ.2వేలు అద్దె కట్టాల్సి వచ్చేది. తన భర్త లారీ డ్రైవర్. భర్త సంపాదనతో పిల్లలను చదివించడంతోపాటు ఇంటి అద్దె చెల్లించడం తలకు మించిన భారమయ్యేది. తమకు కృష్ణాపురంలో స్థలం ఇవ్వడంతో జగనన్న కాలనీ ఇల్లు కట్టుకున్నాం. ప్రస్తుతం ఇంటిలో దిగిపోయాం. అద్దె తప్పింది.

- ఎస్.రామలక్ష్మి, కృష్ణాపురం జగనన్న కాలనీ

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుండాలపేట. 2011లో పద్మనాభం వలస వచ్చాం. సొంత ఇల్లు లేకపోవడంతో పద్మనాభంలో నెలకు రూ.2 వేలు అద్దె కట్టి ఉండేవారం. సొంత ఇల్లు లేకపోవడంతో జగనన్న గుర్తించి ఉచితంగా లక్షలాది రూపాయల విలువ చేసే స్థలం ఇచ్చి తక్కువ ధరకు ఇసుము, తదితర సామగ్రి ఇవ్వడంతో కాలనీ ఇళ్లు నిర్మించుకున్నాం. సుమారు రూ.14.లక్షలు విలువ చేసే ఇల్లు నిర్మించుకున్నాం.

- కె.రాజు, కృష్ణాపురం జగనన్న కాలనీ

క్లుప్తంగా

గ్రామాల్లో ఐసీడీఎస్ సేవలు



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి

గూడెంకొత్తవీధి: పెద్ద అగ్రహారంలో రూ.15లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులకు ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి శనివారం భూమిపూజ చేశారు. మారుమూల గ్రామాల్లో గిరిజనులకు ఐసీడీఎస్ సేవలను అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు.

వ్యాధుల గుర్తింపునకు సర్వే



సూచనలిస్తున్న వైద్యాధికారులు దినేష్, నరేంద్ర

వై.రామవరం: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్ఠు, న్యూమోనియా తదితర వ్యాధుల గుర్తింపునకు సర్వేపై ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లకు, వలంటీర్లకు శనివారం శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్లుగా వైద్యాధికారులు దినేష్, నరేంద్ర పాల్గొని మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఆశ కార్యకర్తలు, వలంటీర్లతో ఒక టీమ్‌గా ఏర్పడి గ్రామస్తులకు కుష్ఠు , నియోనియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించి, వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించి పీహెచ్‌సీకి అందించాలన్నారు.

ఆత్మీయ సన్మానం



డాక్టర్ రామకృష్ణను సన్మానిస్తున్న సిబ్బంది

గంగవరం: పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ ఉన్నత విద్యకు విశాఖపట్నం వెళ్తున్న నేపథ్యంలో ఆయనను వైద్యాధికారి సాయిరతన్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న రంపచోడవరం ఏడీఎంహెచ్‌ఓ అనూష మాట్లాడుతూ నిస్వార్థ సేవలు సమాజంలో ఎల్లవేళలా గుర్తుంటాయన్నారు. డాక్టర్లు భాస్కర్, ఆనంద్ తేజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి సొమ్ము చెల్లించాలి

పాడేరు రూరల్: మండల కేంద్రంలో అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, అనంతగిరి మండలాలకు చెందిన కాఫీ రైతు సంఘాల నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. కాఫీ రైతులకు ఐటీడీఏ సొమ్ము అందడం లేదని సంఘం నాయకులు లక్కు చెప్పారు. సొమ్ము మంజూరు చేయాలని కోరారు. చినబాబు, గురుమూర్తి, నానిబాబు, మహేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజిస్టును నియమించాలి

అరకులోయ/అనంతగిరి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమించాలని, సీపీఎం మండల కార్యదర్శి రామరావు కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేక ప్రసూతి సేవలకు ఇబ్బందిగా మారిందని, తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

గ్రామ వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు రేపు

రాజవొమ్మంగి: చెరువుకొమ్ముపాలెం, జడ్డంగి సచివాలయాల్లో వలంటీర్ పోస్టుల భర్తీ కోసం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 11.30గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ బాపన్నదొర తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని సూచించారు.

వారపు సంతలో దొంగనోటు



దొంగనోటును చూపిస్తున్న మహిళ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో వంద రూపాయల దొంగ నోటు దర్శనం ఇవ్వడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. దొడిపుట్టు పంచాయితీ గోత్తూరుముండా గ్రామానికి చెందిన కూరగాయాల వ్యాపారి సీతకు గుర్తు తెలియని వ్యక్తులు కూరగాయలు కొనుగోలు చేసి వంద రూపాయలు ఇచ్చి వెళ్లి పోయారు. ఆమె మందుల కొనుగోలు నిమిత్తం స్థానిక మెడికల్ షాపునకు వెళ్లి ఆ నోటు ఇవ్వగా, పరిశీలించిన యజమాని దొంగనోటుగా చెప్పడంతో ఆమె నిర్ఘాంత పోయి, నిరాశతో ఇంటిబాట పట్టింది. దొంగ నోట్లు విషయంపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్‌డీఎల్‌తో విజ్ఞానం

- ఒకే సైట్‌లో అన్ని రకాల పుస్తకాలు
- 12 భాషల్లో నాలుగు కోట్లకు పైగా పుస్తకాలు



నేషనల్ డిజిటల్ లైబ్రరీ వెబ్‌సైట్

అనంతగిరి: పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు బయటకు వెళ్లకుండా చదువుకునే వెసులుబాటును కల్పిస్తూ జాతీయ గ్రంథాలయం సంస్థ ప్రత్యేకంగా ఎన్‌డీఎల్ (నేషనల్ డిజిటల్ లైబ్రరీ)ని రూపొందించింది. ఈ సైట్‌లోకి వెళ్తే పాఠశాల మొదలు, విశ్వవిద్యాలయాల వరకు అవసరమైన పుస్తకాలు చదువుకోవచ్చు. అంతే కాకుండా సివిల్స్, గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షల కోసం పుస్తకాలు కొనకుండా గ్రంథాలయం వెళ్లకుండానే ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చు. కోచింగ్ సెంటర్లకు వేలాది రూపాయల ఫీజులు చెల్లించే పరిస్థితి లేకుండా ఒకే వెబ్‌సైట్ ద్వారా వివిధ రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.డిజిటల్ నేషనల్ లైబ్రరీ అందుబాటులోకి తేవడంతో అందరికీ ఎంతగానే ఉపయోగపడుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

12 భాషల్లో...

ఈ సైట్‌లో తెలుగు సహా 12 భాషల్లో సంబంధించి నాలుగు కోట్లకు పైగా పుస్తకాలు పొందుపర్చారు. ఎందరో ప్రముఖులకు చెందిన 3లక్షల పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు, యూనివర్సిటీ, పాఠశాల బోర్డుల ప్రశ్న పత్రాలు, సమాధాన పుస్తకాలు, కంప్యూటర్ సైన్స్, బీఎడ్, డీఎడ్, ప్రభుత్వరంగా పుస్తకాలతో పాటు సాహిత్య పుస్తకాలను చూడొచ్చు, ఆర్టికల్, వీడియో, ఆడియో రూపంలో ఇవన్నీ అందుబాటులో ఉన్నాయి.

విద్యార్థులకు ఉపయోగకరం



విద్యార్థులకు అన్ని విధాలుగా ఈ నేషనల్ డిజిటల్ ఉపయోగపడుతుంది. పోటీ ప్రపంచంలోని పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు ఇందులో లభిస్తున్నాయి. పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్క విద్యార్థికి ఎంతో ఉపయోగపడుతుంది.

– మల్లీశ్వరీ, హెచ్‌ఎం, గిరిజన సంక్షేమ బాలికల వన్ పాఠశాల

కాపుల సంక్షేమానికి కృషి

- కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడప శేషు
- ఎమ్మెల్యే, ఛైర్మన్‌కు గజమాలతో సత్కారం



మాట్లాడుతున్న కార్పొరేషన్ ఛైర్మన్ శేషు, చిత్రంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

ఎటపాక: రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడప శేషు స్పష్టం చేశారు. ఎటపాక మండల మున్నూరు కాపులు ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధన కార్యక్రమానికి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడప శేషు, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్నూరుకాపులకు బీసీడీ కులధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి చేసి నందుకు కాపు సంఘం ఆధ్వర్యంలో వారికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడప శేషు మాట్లాడుతూ ఈ మూడేళ్ల పాలనలో కాపులకు అనేక సంక్షేమ పథకాలు వర్తింప చేసి, వారి అభివృద్ధికి బాటలు వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా అన్ని కులాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో విలీన మండలాల మున్నూరుకాపులు బీసీ–డీ సర్టిఫికెట్లు లేక అనేక ఇబ్బందులు పడ్డారని, బాధలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సర్టిఫికెట్లు పునరుద్ధరించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ముందుగా చిన్నారులు, మహిళలకు నిర్వహించిన నృత్య, పాటలు, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కాపు సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎ.ఉమాశంకర్‌నాయుడు, మండల అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసరావు, కోశాధికారి బి.శివాజీ, సొసైటీ ఛైర్మన్ ఎ.వెంకటరామారావు, జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ, ఎటపాక ,చింతూరు, కూనవరం జెడ్పీటీసీ సభ్యులు సుస్మిత, మురళి, జ్యోతి, నాలుగు మండలాల ఎంపీటీసీలు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల కాపు సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ధ్యేయం

పెదబయలు: గలగండ పంచాయితీ ఈదులపుట్టు గ్రామంలో ఆదివాసీ మిత్ర ఆధ్వర్యంలో గ్రామమిత్ర సభ్యులకు ఏర్పాటు చేసిన అవుట్ లెట్‌ను సర్పంచ్ లోభిదాసు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మహిళాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పని చేయాలన్నారు. ఆదివాసీలు పండించే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. సంస్థ సీఈవో మన్మధరావు మాట్లాడుతూ పాడేరు, హుకుంపేట, పెదబయలు మండలాల్లో 150 మంది మహిళలతో మినీ అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేశామన్నారు.సంస్థ ప్రతినిధులు జగ్గారావు, సుధాకర్, మ్యాక్స్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



ఈదులపుట్టులో అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ లోభిదాసు

15 నుంచి న్యుమోనియాపై అవగాహన కార్యక్రమాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : న్యుమోనియా వ్యాధి నివారణలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తెలిపారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో న్యుమోనియా వ్యాధిపై అవగాహన కార్యక్ర పోస్టర్లను ఆయనతోపాటు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని గిరిజన గ్రామాల్లో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఈనెల 15 నుంచి వచ్చే నెల 3వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పీవో సూచించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, డీఐవో డాక్టర్ ప్రభావతి, డీసీటీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



శిబిరానికి వచ్చిన గ్రామస్తులు

జి.మాడుగుల: కోరాపల్లి పంచాయతీ అరగడాపల్లిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ శశి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తినా అశ్రద్ధ చేయకుండా పీహెచ్‌సీ, వైద్యులను సంప్రదించాలన్నారు. శిబిరంలో 65మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు.పీహెచ్‌ఎన్ గౌరీ, సిబ్బంది వరలక్ష్మి, లాల్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



తల్లాబుతోటలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రమేష్

తల్లాబుతోటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ తల్లాబుతోట గ్రామంలో డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ సేవలందించారు. ఇంటింటికీ వెళ్లి రోగుల వివరాలు సేకరించి, పలు ఆరోగ్య సూచనలిచ్చారు. ముఖ్యంగా నడవలేని పరిస్థితిలో ఉన్న రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని ఆయన చెప్పారు. వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, అశోక్, శ్రీను, లలిత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డివిజన్ స్థాయి ఆటల పోటీలు

పాడేరు రూరల్ : టౌణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శనివారం ముగిసింది. ఈ పోటీలకు ఏజెన్సీ 11 మండలాల నుంచి పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. అండర్–14 బాలికలకు 15 క్రీడాంశాల్లో, అండర్–17 బాలికలకు 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఒక్కో గేమ్‌కు 12 మంది చొప్పున ఒక్కో ఈవెంట్‌కు ఇద్దరేసి చొప్పున ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పాంగి సూరిబాబు తెలిపారు. మొత్తం మీద 166 మందిని ఎంపిక చేయగా, వీరిలో జూనియర్స్ విభాగంలో 78 మంది, సీనియర్స్ విభాగంలో 88 మంది ఉన్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గ్రామాల్లో 'గడప గడపకు' రేపు

కొయ్యూరు: అంతాడలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు శనివారం తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రాజవొమ్మంగి: తంటికొండ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తరలిరావాలని కోరారు.

గిరిజనుల అభ్యున్నతికి నిరంతర కృషి

- సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్

ముంచంగిపుట్టు: గిరిజనుల అభ్యున్నతికోసం పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తుందని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమొండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ కమొండెంట్ రాజేష్ పాండే ఆదేశాల మేరకు స్థానిక ఇ–198 బెటాలియన్ పోలీసులు సివిల్ యాక్షన్ ప్రోగ్రాం శనివారం మండల కేంద్రంలోని హాలీ గ్రౌండ్‌లో నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమొండెంట్ రాజ్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర చేతుల మీదగా మారుమూల బూసిపుట్టు, రంగబయలు, బాబుశాల, కుమడ, లక్ష్మీపురం, వనుగుమ్మ పంచాయితీలకు చెందిన 188 మందికి గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం గిరిజనులతో కలిసి భోజనాలు చేశారు.ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనులు అన్ని విధాల అభివృద్ధి సాధించాలని సంకల్పంతో పోలీసుశాఖ నిరంతరం పని చేస్తుందన్నారు.ఇన్‌స్పెక్టర్ సదానంద యాదవ్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



గిరిజనులకు గొడుగులను పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమొండెంట్ రాజ్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర

దాతల సాయంతో బోరు ఏర్పాటు

పెదబయలు: మండల కేంద్రంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న అయ్యప్ప స్వామి పీఠానికి దాతల సహకారంతో తాగునీటి సదుపాయం కల్పించినట్టు సర్పంచ్ మాధవరావు, గురుస్వామి వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక గ్రామ నివాసి షావుకారి బాలాజీదాసు దంపతుల ఆర్థిక సాయంతో బోరు ప్రారంభించారు. అయ్యప్ప పీఠానికి సర్పంచ్ చేతుల మీదుగా నీటిని సరఫరా చేశారు.అయ్యప్ప పీఠానికి, భీమలింగేశ్వర స్వామి ఆలయానికి నీటి సమస్య తీరడంపై స్థానికులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.అర్చకుడు శ్రీనివాస్ శర్మ, నాయకులు సూరయ్య, లక్ష్మణరావు, గురుస్వామి వీరన్న, విశ్వనాథం, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ మాధవరావు, అయ్యప్ప మాలధారులు, నేతలు

జిల్లా స్థాయి పోటీలకు ఆశ్రమ విద్యార్థులు

అడ్డతీగల: అడ్డతీగలలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం కె.వరప్రసాద్, పీఈటీ శశికాంత్‌రెడ్డి తెలిపారు. టెన్నీ క్వాయిట్ అండర్–14లో కె.శ్రీనివాస రెడ్డి, లోవకుశరెడ్డి, జి.వెంకటేష్, అండర్–14 చెస్‌లో జి. గణేష్, అండర్–14 వాలీబాల్‌లో బి.వి.వి.సత్యనారాయణ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న హెచ్‌ఎం వరప్రసాద్



జిల్లా స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా పరిషత్ ఛైర్మన్ వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ వేణుగోపాలరావు



జెడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావును సన్మానిస్తున్న మారేడుమిల్లి నాయకులు



రంపచోడవరంలో జెడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే ధనలక్ష్మిను కలిసిన నాయకులు

చింతూరు: ముంపు మండలాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం నిధుల మంజూరుకు కృషి చేస్తానని తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. చింతూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకుల సమావేశంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలకు నాలుగు మండలాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు సాయం అందించిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా పర్యటించి బాధితుల సమస్యలు తెలుసుకున్నారన్నారు. ముంపు గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి నిధులు మంజూరయ్యేలా చూస్తానని ఆయన హామీ నిచ్చారు.

నిర్వాసితులందరికీ పరిహారం

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులెవరూ అధైర్యపడొద్దని, ముంపునకు గురయ్యే నిర్వాసితులందరికీ పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా పేదలకు అందేలా చర్యలు చేపట్టిందని, గడప, గడపకు ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి, జెడ్పీటీసీ సభ్యులు విజయ, బాలాజీ, ఎంపీపీలు అమల, రంగమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ ఛైర్మన్ దృష్టికి సమస్యలు

రంపచోడవరం: మండలంలో నెలకొన్న సమస్యలపై జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ రావు, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి స్థానిక ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ రామన్నదొర, రామకృష్ణదొర, ఎంపీటీసీ లక్ష్మి తదితరులున్నారు.

మారేడుమిల్లి: చింతూరు వెళ్తున్న జెడ్పీ ఛైర్మన్ వేణుగోపాల్, రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మిలను స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీ ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యసాయి సిబ్బంది బకాయి జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీ బాబు, కో–ఆప్షన్ సభ్యుడు ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యుడు అనిల్, పార్టీ కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు గంగరాజు, బాబీ, అనిదీప్ కుమార్, సురేష్, దేవి తదితరుల్నున్నారు..

వీఆర్ పురం: వీఆర్ పురం మండలం మీదుగా పాడేరు, కాకినాడకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ జెడ్పీ ఛైర్మెన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే ధనలక్ష్మిలకు స్థానిక ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందచేశారు. ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, సర్పంచ్‌లు రామారావు, నరసమ్మ, శారద, సొసైటీ ఛైర్మెన్ మురళి తదితరులున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతో పాటు మండలంలో నెలకొన్న పలు సమస్యలను జెడ్పీ ఛైర్మన్ వి.వేణుగోపాలరావుకు జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి వివరించారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వై.రామవరం: మారేడుమిల్లి మండలం బంద గ్రామం నుంచి కానివాడ వెళ్లే రోడ్డు పనులకు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు శనివారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ రోడ్డు కోసం రూ.20లక్షలు మంజూరైనట్టు చెప్పారు.వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి,సర్పంచ్ శిల్పారాణి, జేఈ రవితేజ, నాయకులు కనకరాజు, భారతిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

గూడెంకొత్తవీధి: పెదవలస పంచాయతీ రంపుల నుంచి మల్లుపడాల్ వీధి, అక్కడి నుంచి టెంట్ల వీధి వరకు జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయిలను ఏర్పాటుచేశారు. వాటిని సర్పంచ్ కృష్ణారావు, వైస్ ఎంపీపీ ఆనంద్ శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పిస్తోందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పీఏసీఎస్ ఛైర్మన్ ప్రసాద్, ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం తగదు

చింతపల్లి: అభివృద్ధి పనులపై టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేయడం తగదని ఎంపీపీ కొరాబు అనూషదేవి అన్నారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిపై టీడీపీ నాయకురాలు గిడ్డి ఈశ్వరి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని ఖండిస్తున్నామన్నారు. గ్రామస్తుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా పనులు చేపట్టేది లేదని స్పష్టం చేశారు. ఇకపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షుడు రవి, ఎంపీటీసీ జయలక్ష్మి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి

ఆటో డ్రైవర్లకు సూచనలు



సూచనలిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: స్థానిక హనుమాన్ ఆటో యూనియన్ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని సూచించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

చింతపల్లి: మండలంలో కిటుముల పంచాయతీ బౌడా గ్రామంలో గిరిజనుడికి చెందిన స్థలంలో గిరిజనేతరుడు అక్రమంగా నిర్మించుకున్న ఇంటిని శనివారం అధికారులు కూల్చివేశారు. అక్రమ నిర్మాణంపై ఐటీడీఏ స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.


బోరు పనుల పరిశీలన

వీఆర్ పురం: కుందులూరులోని తాగునీటి పథకానికి నీటి సరఫరా చేసే బోరును పంచాయతీ వార్డు సభ్యుడు నరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజు పరిశీలించి, సక్రమంగా పనిచేస్తోందన్నారు. బోరు పనిచేయడం లేదని కొంతమంది పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారన్నారు. సక్రమంగా ఉన్న బోరును పనిచేయడం లేదని చెప్పడం సరికాదన్నారు. రత్తయ్య, నరేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి: స్థానిక కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. లలితా సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధాన నిర్వహించారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు



వరుణ్ సందేశ్ దొర

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బాలుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు చినబాబు తెలిపారు. రంపచోడవరం మండలం పెదకోరుమిల్లి గ్రామానికి చెందిన కారం అజయ్‌వరణ్ సందేష్ దొర ఈ నెల ఏడో తేదీ నుంచి కనిపించడం లేదని వార్డెన్ శ్రీనివాస్ ఫిర్యాదు అందినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు తెలిపారు. బాలుని ఆచూకీ తెలిస్తే గంగవరం స్టేషన్ నంబరు 9440900767కు ఫోన్ చేయాలని సూచించారు.